

# వైకుంఠయాత్ర

## - మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**శివాజీ ఇంట్లోంచి** బయటికి రావడం బిస్కెట్ వ్యాన్‌లో దాక్కుని వున్న తాతారావు చూశాడు. రాములుని తయారుగా వుండమని హెచ్చరించాడు. సందు చివరదాకా నడిచి వెళుతున్న శివాజీని చూసి అడిగాడు రాములు.

"పని కానివ్వనా?"

"ష్... ఇంటిముందు అయితే ఏ గూర్ఖానో మన టైర్ పేలిస్తే ప్రమాదం. పిట్ట ఒంటరిగా వెళుతోంది. ఎంత దూరం వెళుతుందో వెళ్లనీ."

"ఎంత ధైర్యం వాడికి?"

"ఇంత త్వరగా మనం ప్రయత్నిస్తామని ఊహించి వుండడంతే."

తాతాచారి బైనాక్యులర్‌తో చూశాడు శివాజీ సందు చివర ఎస్‌టిడి బూత్ లోపలికి వెళ్ళడం

ఎస్‌టిడి బూత్ బిజీగా వుంది. శివాజీ వెన్నెల ఇంటి ఫోన్ నంబరు చెప్పాడు.

అతను అది రాసుకుని ఒకటికి నాలుగుసార్లు ప్రయత్నించాడు.

పావుగంట తర్వాత దొరికింది అతని లైను.

"హలో శివాజీ" వినిపించింది వెన్నెల కంఠం.

"నేనేనని ఎలా కనుక్కున్నావ్?" అడిగాడు.

"ఈ టైములో మాకు ఫోన్ రాదు. సో.. ఫోర్త్ రేట్ కాబట్టి మీరు చేస్తారని వూహించాను. పవన్‌ని చూశారా?"

"ఆహా! అచ్చం నాలానే వున్నాడు."

"సినిమాలో సెకండ్ హీరోలానా?"

"సరిగ్గా అలాగే. మా పెద్దమ్మకి మా అమ్మంటే కోపం" తనకి తెలిసిన విషయాలన్నీ చెప్పాడు.

"ఎన్ని రోజులుంటున్నారు?"

"ఇంకా అనుకోలేదు. నాలుగైదు రోజులు మించి వుండను."

"మీ మీద అప్పుడే దిగులు మొదలయిందోయ్..." కవ్వింపుగా చెప్పింది వెన్నెల.

"అలాగా! నాకు రేపట్నుంచి మొదలవ్వచ్చు. ఇవాళ నా బ్రదర్‌ని చూశాగా అందుకేనేమో హేపీగా వున్నాను."

"ప్రేమలో ఉన్నవారు ఆనందంగానే వుంటారట. నిజానికి పెళ్ళికన్నా ఆకర్షణీయంగా వుంటుందట."

"మనిద్దరం ఓ బెట్ కడదామా?" అడిగాడు.

"ఏమిటి?"

"మనకు పుట్టబోయేది ముందు అబ్బాయా? లేక అమ్మాయా అని."

"ఎంత పందెం?" ఉత్సాహంగా అడిగింది వెన్నెల.

"ఎవరో ముందు నువ్వు చెప్పు."

"ముందు అబ్బాయి, ఆ తర్వాత అమ్మాయి."

"ఆ తర్వాత అమ్మాయి, అమ్మాయి, అబ్బాయి, అమ్మాయి అబ్బా..."

"అమ్మో స్టాప్...స్టాప్."

"అదీ పందెం ముందు అమ్మాయి."

"నేను మీతో పందెం కట్టను బాబు" చిన్నగా నవ్వింది వెన్నెల.

"నేను నిన్నుప్రేమించానని నాకు ఎప్పుడు తెలిసిందో తెలుసా? నా ఆనందం కోసం నేను నీ మీదే ఆధారపడాలని అనిపించినప్పుడు."

"నాకెప్పుడు ఆ సంగతి తెలిసిందో తెలుసాండి? మీరు 'ఆడుతు పాడుతు పనిచేస్తుంటే' పాట పాడుతున్నప్పుడు."

"మళ్ళీ పాడనా?"

"ఇది ఎస్‌టిడి."

ప్రేమలో ఉన్నవారు మాట్లాడుకునే మాతలు వాళ్ళకి తప్ప ఇతరుల వేవ్ లెంగ్త్‌లో వుండవు. ఇతరులకు అర్థంకావు. అందుకే వాటిని 'స్వీట్ నథింగ్స్' అన్నారు. అందుకే కామోసు షేక్స్‌పియర్ అన్నాడు 'నీ ప్రియురాల్ని నువ్వు పెళ్ళి చేసుకోకపోతే బాధ పడతావు' అని. ప్రేమ, బాధ కవలలు.

"ఉంటా ఇంక" గుడ్‌నైట్ చెప్పింది వెన్నెల అయిదు నిమిషాల తర్వాత.

"రేపు మళ్ళీ ఇదే టైముకి చేస్తాను."

"గుడ్‌నైట్."

రిసీవర్ క్రెడిల్ మీద వుంచి, బిల్లు చెల్లించి బయటకి నడిచాడు శివాజీ.

సూరి పార్టిషన్ హోల్‌కి ఉన్న చిన్న తలుపు తెరచి చెప్పాడు తాతాచారితో.

"స్టార్టు చేసి రెడిగా వుండు."

శివాజీ దగ్గరకి రాగానే రాములుకి సైగ చేసి తలుపు తెరిచారు. వీధి అంతా నిర్మానుష్యంగా వుంది ఒక్క ఉదుటున ఇద్దరూ బయటికి దూకారు.

అకస్మాత్తుగా తనమీదకి వచ్చిన వాళ్ళిద్దరి వంక బిత్తరపోతూ చూశాడు శివాజీ. అతను రియాక్ట్ అయ్యేలోగానే తాతాచారి తన చేతిలోని టవల్‌ని శివాజీ మొహానికి అదిమాడు.

తియ్యటి వాసన వేసింది శివాజీకి.

"ఇతనెళ్ళి గంట అవలా?" అడిగింది ఆదిలక్ష్మమ్మ.

"అయింది."

"ఫోన్‌కి ఇంతసేపా?" ఆదుర్దాగా అడిగిందావిడ.

"నేను చూస్తానుండు" చలపతి చెప్పులు తొడుక్కుని బయటికెళ్ళి అయిదు నిమిషాల్లో వచ్చి చెప్పాడు.

"దారిలో ఎక్కడా లేడు."

"మరేమయ్యాడు?" అడిగాడు పవన్ కూడా.

"అదేమిటి? అలా ఎలా మాయమయ్యాడూ?" అడిగింది ఆదిలక్ష్మమ్మ ఆశ్చర్యంగా.

"భోజనం అయ్యాక వాకింగ్ అలవాటున్నా ఇంతసేపు వాకింగ్‌కి వెళ్ళడుగా? కుమారస్వామి ఏదయినా చేసుంటాడంటావా బాబాయ్?" అడిగాడూ పవన్ అనుమానంగా.

"శివాజీకి తెలిసినవాళ్ళెవరయినా వుంటే, వాళ్ళింటికి వెళ్ళాడేమో?"

"అతను లోకల్ ఫోన్ కాల్ కోసం కాదు బయటికి వెళ్ళింది, అలా అనుకోడానికి" ఆదిలక్ష్మమ్మ తన కొడుకు ఆలోచనని ఖండించింది.

"అయితే తప్పకుండా ఇది కుమారస్వామి పనే అయుండాలి."

"మరి బాబాయ్‌కి శవం ఎక్కడా దారిలో కనబడలేదుగా?" అడిగాడు పవన్ ఆలోచిస్తూ.

"ఇంటి దగ్గర కాక దూరంగా తీసుకెళ్ళి చంపాలన్నది వాళ్ళ ప్లాన్ అయివుండవచ్చు. ఓ గంట దాకా చూసి నువ్వు వాకింగ్‌కి బయటికి వెళ్ళావని, తిరిగి రాలేదని పోలీస్ కమీషనర్ ఇంటికి ఫోన్ చేసి చెప్తాను. రేపు ఉదయందాకా చూసి రాకపోతే అఫిషియల్‌గా రిపోర్టు చేస్తాను."

"అదే మంచి ఆలోచన. ఒకవేళ ఈ రాత్రి శివాజీకి ఏదయినా అయి అతని శవం దొరికినా, మనం రిపోర్టు చేయలేదేమిటన్న అనుమానం రాదు" చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

మరోసారి చలపతి బయటికి వెళ్ళి రోడ్డుమీద చూసొచ్చాడు. ఎక్కడా శివాజీ జాడ లేదు.

ఓ గంట ఆగి పోలీస్ కమీషనర్ ఇంటికి ఫోన్ చేసి వాళ్ళనుకున్నట్లుగానే చెప్పాడు.

"అలాగా! అన్ని పోలీస్ స్టేషన్స్‌కి ఈ ఇన్ఫర్మేషన్ పంపిస్తాను. నైట్ బీట్‌లో వున్నవారి నుంచి ఏదయినా సమాచారం రావచ్చు. ధైర్యంగా ఉండండి. కుమారస్వామి వెంటనే అంత ధైర్యం చేస్తాడని నేననుకోను."

"అతనెంత పట్టుదలగల మనిషో మీకు తెలియంది కాదు"

"రేపు ఉదయం నేనే స్వయంగా విచారణ చేస్తాను. గుడ్‌నైట్ సర్."

"గుడ్‌నైట్."

ఫోను పెట్టేశాడు చలపతి. ఆయనకు ఎలాంటి ఆందోళన లేదుకాని పవన్, ఆదిలక్ష్మమ్మలలో ఎక్సయిట్‌మెంటు బాగా కనిపిస్తోంది.

శివాజీ ఏమయ్యాడా అన్న ప్రశ్న వాళ్ళిద్దరిలో మెదులుతోంది. నూటికి తొంభై పాళ్ళు కుమారస్వామి మనుషుల చేతికి చిక్కి వుంటాడని ఇద్దరూ నమ్మసాగారు.

ఆ రాత్రి బాంబేలోని పావనికి శివాజీ లేని వెలితి స్పష్టంగా తెలుస్తోంది.

ఇంట్లో వుండేది వాళ్ళిద్దరే కాబట్టి ఆవిడకి అతనితో ఉండే అనుబంధం అపారం. 'తన మాట విని వెళ్ళకుండా వుంటే బావుండేది' అనిపించసాగింది.

'రేపు పెళ్ళయ్యాక వేరు కాపురం పెడితే ఎలా?' అన్న ఆలోచనకూడా వచ్చింది. పిల్లలు పుట్టి వాళ్ళు పెద్దవాళ్లయితే ఈ సింగిల్ బెడ్‌రూం ఇల్లు సరిపోదు. అప్పుడయినా వేరు కాపురం గురించి ఆలోచించవచ్చు లేదా కోడలు చుప్పనాతిదయినా...

వెన్నెలమీదకి మళ్ళాయి ఆవిడ ఆలోచనలు. ఆమె మాట, తీరు అలా అనిపించలేదు. అయినా ఎవరి మనసులో ఏం వుందో తెలుసుకోవడం సాధ్యంకాదు.

ఆ విషయం వెన్నెలని డైరెక్టుగా అడగాలనుకుంది పావని.

కొడుకు లేకుండా వెళ్ళాలా, వద్దా అనే మీ మాంసలో ఉన్న ఆవిడకి ఈ కొత్త ఆలోచనతో అది తొలిగిపోయింది.

లేచి బుక్ షెల్ఫ్ దగ్గరకి నడిచింది. అందులో ఆవిడ గత పాతికేళ్ళుగా కొన్న పుస్తకాలు వున్నాయి. వాటిల్లోంచి ఆల్‌బర్టో మొరానియా రాసిన 'కాంజుగల్ లవ్' అనే నవల తీసి చదవసాగింది.

## 17

శివాజీకి మెలుకువ వచ్చేసరికి అంతా చీకటిగా వుంది. క్షణకాలం అర్ధంకాలేదు తనెక్కడున్నాడో. రేడీయం డయల్ వాచ్ చూసుకుందామని చేతిని కదిపినప్పుడు అర్ధమైందతనికి, తనై తాళ్ళతో కట్టేశారని.

వీపు మీది స్పర్శనిబట్టి తనని మంచం మీద పరుపుకి కట్టేశారని తెలుసుకున్నాడు. అతనికి భయం వేయలేదు. ఆశ్చర్యం వేసింది.

తనని ఎవరు ఇలా కట్టేసింది? క్రమంగాఅతనికి జరిగింది గుర్తుకొచ్చింది.

ఎస్‌టిడి చేశాక నడిచి వస్తుంటే ఇద్దరు తనని సమీపించారు. తన మొహం మీద ఏదో కప్పారు తియ్యటి వాసన వేసింది.

తనని ఆ ఇద్దరూ మోసుకుని వ్యాన్‌లోకి ఎక్కిస్తుండగా ప్రతిఘటించాలనుకున్నాడు. తనని వ్యాన్‌లో సీటుమీద పడుకోబెడుతుండగా స్పృహతప్పింది. ఇప్పుడు మళ్ళీ మెల్లుకువ వచ్చింది.

తనున్నది వ్యాన్‌లో కాదు. అంటే ఇంకెక్కడికో తీసుకువచ్చారు. ఎక్కడికి? ఎందుకు? ముఖ్యంగా 'ఎందుకు?' అన్న ప్రశ్న శివాజీని బాధించసాగింది. హైదరాబాదులో 'మాఫియా గ్యాంగ్స్ ఎక్కువా. కిడ్నీలాంటి అవయవాలు తొలగించి అమ్మే గ్యాంగ్ చేతిలో చిక్కుకున్నాడా?' అతనికి వళ్ళు జలదరించింది. అదే నిజమయితే తను గొప్ప ఆపదలో పడ్డట్లే.

కట్లు విప్పతీసుకోడానికి ప్రయత్నించాడు. కాని చేతులు ఎంత గట్టిగా లాగినా తాళ్ళు చర్మానికి వరుసుకున్నాయి తప్ప తెగలేదు. చాలా గట్టిగా కట్టారు. కొద్దిసేపట్లో అతనికి మళ్ళీ నిద్రపట్టింది.

అది సహజ నిద్ర.

18

కుమారస్వామి దగ్గరకి రాత్రి పదకొండుంపావుకి వచ్చారు తాతాచారి, రాములు, సూరి.

నాలుగో పెగ్గులో ఉన్న కుమారస్వామితో చెప్పారు.

"దొరికాడు సార్. కట్టిపడేశాం."

"గుడ్! సఫా చేయండి."

తన చేతిలోని గ్లాసులో వున్న విస్కీవంక కొద్ది క్షణాలు ఆలోచనగా చూశాడు. తర్వాత చిన్నగా నవ్వి దాన్ని ఒక్క గుక్కలో పూర్తిగా తాగి చెప్పాడు.

"ఏ టిక్ ట్వంటీనో తాగించండి .ఆత్మహత్య చేసుకున్నాడనుకోవాలి అంతా."

"కారణం?"

"ఏ రోజు పేపర్ చూసినా 'కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య' వార్త క్రైం కార్నర్‌లో వస్తూంటుంది. అంతా నేనే చెప్పాలా?" విసుక్కున్నాడు కుమారస్వామి.

"సరే"

"వెళ్ళండి. పని చూడండి ముందు" ఆ ముగ్గురూ నాలుగడుగులు వేశాక చెప్పాడు కుమారస్వామి.

"రూమ్ నంబర్ ఎంత?"

"త్రీ నాట్ వన్."

"సరే చావబోయే ముందు వాడితో ఓసారి మాట్లాడతాను. ఎవరు చంపుతున్నారో, ఎందుకు చంపుతున్నారో తెలియాలి వెధవకి."

"కాని ఓ పెన్ లైన్‌లో అలా మాట్లాడటం మంచిది కాదేమో?" సూచించాడు తాతాచారి.

"అక్కడనుంచి నంబరు కలవడంలేదుగా? ఎవరూ రికార్డు చేయరు కూడా. ఇంటి నుంచి కాక బయటినుంచి మాట్లాడతాను. ఎవరూ నన్ను ట్రేస్ చేయలేరు. అప్పటికి ఈ బాటిల్ కూడా చస్తుంది" నవ్వుతూ అన్నాడు కుమారస్వామి.

వాళ్ళు ముగ్గురూ వెళ్ళాక బాటిల్‌లో మిగిలిన విస్కీని పూర్తిచేశాడు. ఆ తర్వాత అలవాటుగా అగ్గిపుల్ల గీసి దాన్ని ఖాళీ అయిన బాటిల్‌లో పడేశాడు.

'ఉష్' అనే శబ్దం చేస్తూ బాటిల్ అడుగుభాగం నుంచి సీసాపై భాగానికి లేచింది నీలిమంట.

"డ్రయివ్‌ది డెవిల్ అవుట్" బయటికి ఇచెప్పాడు కుమారస్వామి.

కారులో అరకిలోమీటరు దూరంలో వున్న ఎస్‌టిడి బూత్‌లో గాజు కేబిన్‌లోకి వెళ్ళి తలుపు మూసుకుని ఆ హోటల్ నంబరు తిప్పాడు. అవతలివైపు ఫోన్ ఎత్తాక రూం నంబర్ చెప్పాడు. కొద్దిక్షణాల్లో అవతలి వైపు రూములో రిసీవరు ఎత్తారు.

రాత్రి పన్నెండుంపావుకి ఎవరో తట్టిలేపితే మెలుకువ వచ్చింది శివాజీకి.

గదిలో బల్బ్ వెలుగుతోంది. ఎదురుగా ఇద్దరు నిలబడి వున్నారు. తనని కిడ్నాప్ చేసినవాళ్ళు వీళ్ళే అని గుర్తుపట్టాడు. నోటికి ప్లాస్టర్‌ని తొలగించారు వాళ్ళు.

"ఎవరు మీరు?" అడిగాడు కళ్ళు చికిలించి చూస్తు.

"నీ వైకుంఠ యాత్రకి ట్రావెల్ ఏజెంట్స్‌మి" నవ్వుతూ చెప్పాడు తాతచారి.

"అంటే రెండు కిడ్నీలు తీసేస్తున్నారా? ఒక్కటి వుంచి ఇంకొకటి తీసుకోవచ్చుగా?" అడిగాడు శివాజీ.

"కిడ్నీ ఏమిటి?"

"అయితే ఆ వ్యాపారం కాదా మీది? నన్నెందుకు చంపదల్చుకున్నారో తెలుసుకోవచ్చా?"

"కుమారస్వామి బావమరిదిని చంపించినందుకు."

"ఎవర్ని?"

"రామ్ గోపాల్‌ని."

"నేను చంపించానా? మీరు ఎక్కడో పొరపాటు పడ్డారు.

"కనీసం కుమారస్వామి అలా నమ్ముతున్నాడు. అది చాలు నీ చావు మూడటానికి."

"ఇంతకీ కుమారస్వామి ఎవరు?"

"అలా వచ్చావా? మేం ఇలా వస్తాం. నీ ఫారిన్ టూర్‌కి ఫైనాన్షియర్."

"అర్థం అయ్యేలా చెప్పండి. ఎవరా కుమారస్వామి?" శివాజీలో భయం, కంగారు తగ్గాయి. వాళ్ళు పట్టుకు వచ్చింది రాంగ్ పర్సన్‌ని అని నమ్మడంతో.

"నీలాగే ఎం.ఎల్.ఏ"

"నాలాగా ఎం.ఎల్.ఏనా..?"

అప్పుడు స్ఫురించింది శివాజీకి. తనని వాళ్ళు ఎవరని భ్రమపడుతున్నారో.

పవన్.

వాళ్ళక్కావలసింది పవన్. కాని తనని పవన్‌గా భావించి పట్టుకొచ్చారన్నమాట.

"మీకో సంగతి తెలీదు నేను పవన్‌ని కాదు" చెప్పాడు శివాజీ.

ఆ ఇద్దరు ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు కొద్దిక్షణాలు. తర్వాత ఫక్కున ఒకేసారి బయటికి నవ్వారు.

"నేను మాత్రం పవన్‌ని కాను. శివాజీని."

"శివాజీనా? అయితే నీ కత్తి, గడ్డం, గుర్రం ఏవి?" అడిగాడు రాములు నవ్వుతూ.

"చూడు పవన్. నువ్వు కొత్తపేరు, కొత్త ఊరు చెప్పినంత మాత్రాన మా చెవుల్లో పులు పెట్టలేవు."

"తెలివయిన వాడివయితే 'నన్ను వదిలిపెట్టేందుకు ఎంతకావాలి?' అని అడిగి వుండేవాడివి. నీకదీ తట్టలేదు" చెప్పాడు రాములు.

"ఆల్‌రైట్ నన్ను వదిలిపెట్టడానికి ఎంతకావాలి?" అడిగాడు శివాజీ.

"కోటి రూపాయలిచ్చినా వదలం. కుమారస్వామికి ఆల్‌రెడీ చెప్పేశాం నిన్ను పట్టుకొచ్చామని" అని రాములు వైపు తాతాచారి కోపంగా చూస్తూ చెప్పాడు. "ఏమిటా మాటలు? ఇది కుమారస్వామికి చేరితే?"

తన మాటలు వాళ్ళు నమ్మడం లేదని గ్రహించాక చెప్పాడు మళ్ళీ.

"కావాలంటే చూడండి. నా కుడి చెవి వెనక పుట్టమచ్చ వుంది. పవన్‌కి ఆ మచ్చ లేదు."

"ఎవరికి ఎక్కడ పుట్టుమచ్చలున్నాయో మాకేం తెలుసు? చావు తెలివితేటలంటే యివే."

శివాజీ తీవ్రంగా ఆలోచించాడు తాను శివాజీనని, పవన్‌ని కాదని ఎలా వాళ్ళని నమ్మించాలి అని. అతనికి తన లోకల్ రైల్వే పాస్ గుర్తుకొచ్చింది.

"కావాలంటే నా పర్స్ తీసి చూడండి. అందులో బాంబేలో బాంద్రానుంచి చర్చ్ గేట్‌దాకా లోకల్ పాస్, నా ఫోటో, పేరు వున్నాయి" ఉత్సాహంగా చెప్పాడు.

తాతచారి సైగని చూసి రాములు శివాజీ జేబులోంచి పర్సు తీసి చూశాడు. అందులో వెతికి లోకల్ ట్రెయిన్ పాస్ తీసి తాతాచారికిచ్చాడు.

శివాజీ చెప్పినట్లు అతని ఫోటో, పేరు, మిగిలిన వివరాలన్నీ అందులో వున్నాయి.

"దీన్ని ఇష్యూ చేసింది వారం క్రితమే" తాతాచారి పరిశీలనగా చెప్పాడు చూసి.

"అవును నెలనెలా తీసుకుంటాను. లాస్ట్ మంత్ పాస్ ఎక్స్పయిర్ అయితే కొత్తది తీసుకున్నాను."

"లాస్ట్ మంత్ పాస్ ఏది?" అడిగాడు తాతాచారి వెంటనే.

"డస్ట్‌బిన్‌లో పారేశాను"

"అని నమ్మమంటావు. నీ ఫోటోతో శివాజీ పేరుతో, పవన్ పేరుతో ఇంకా వంద పేర్లతో ఇలాంటి పాస్‌లు తీసుకోగలవు. ఇదేమయినా పాస్‌పోర్టా?"

"ఈ రోజుల్లో దొంగ పాస్‌పోర్ట్ తీసుకోవడం కూడా తేలికే" చెప్పాడు రాములు నవ్వుతూ.

"ఇంత చెప్పినా మీరు నమ్మకపోతే ఎలా కావాలంటే పవన్ యింటికి.."

ఆ గదిలో టెలిఫోన్ మోగింది. రిసీవరు అందుకున్నాడు తాతాచారి.

"వాడివ్వు అన్నాడు కుమారస్వామి. తాగి వున్నాడని గ్రహించాడు తాతాచారి అతని గొంతుని బట్టి.

తాతాచారి రిసీవరుని అతని చెవి దగ్గర ఆనించాడు.

"మాట్లాడు" గద్దించాడు రాములు.

"హలో.. ఎవరది?" అడిగాడు శివాజీ.

"నీ తల్లో జేజెమ్మనిరా."

"అర్థంకాలేదు."

"నా బావమరిదిని చంపించినందుకు ఇదీ నీకు శాస్తి. ఇంకాసేపట్లో నువ్వు.."

"ఆగండాగండి. మీ వాళ్ళు పొరబడ్డారు. నేను శివాజీని. పవన్‌నికాను. అనవసరంగా మీరు పవన్‌కి బదులు ఇంకో అమాయకుడ్ని చంపుతున్నారు. తర్వాత జరిగిందానికి మీరే బాధపడతారు" చకచకాచెప్పాడు శివాజీ.

"నువ్వు పవన్‌వి కాదా? మరెవరివి?"

"నా పేరు శివాజీ. పవన్ నా పెద్దమ్మ కొడుకు. చూడటానికి ఇద్దరము ఒకేలా వుంటాం. ఇవాళ ఉదయం బాంబే నుంచి చలపతి, నేను కలసి వచ్చాం."

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"నే చెప్పేది నిజం. కావాలంటే బాంబే నుంచి శివాజీ పేర ఇవాళ వచ్చిన ప్రయాణికుల లిస్టులో నా పేరుందో లేదో చెక్ చేసుకోండి."

"చూడు పవన్. అబద్ధం ఆడటం కూడా చేతకాదు నీకు. మీ నాన్నకి నువ్వొక్కడివే కొడుకువి. మీ అమ్మకి చెల్లెళ్ళు లేరని నాకు తెలుసు."

"కాదు శేషగిరికి మా అమ్మ రెండో భార్య. ఆదిలక్ష్మమ్మ మొదటి భార్య. నేను మానాన్నగారి రెండో భార్య పావనమ్మ కొడుకుని. పవన్.."

"శేషగిరికి వున్నది ఒక్క భార్య మాత్రమే. చస్తాననే భయంతో నువ్వేం మాట్లాడుతున్నావో నీకే తెలియటంలేదు. తాతని మాట్లాడమను."

"నా దగ్గర ఐడెంటిటీ కార్డు కూడా వుంది. అతనిప్పుడే చూశాడు కూడా. కావాలంటే అడుగు."

తాతాచారి రిసీవర్‌ని చెవి దగ్గరుంచుకుని అవతల నుంచి చెప్పేది విని "అలాగే సార్. అంతా పావుగంటలో అయిపోతుంది" చెప్పాడు.

జరగబోయేది గ్రహించిన శివాజీ వెంటనే అరిచాడు.

"మళ్ళీ కుమారస్వామితో మాట్లాడతాను."

తాతాచారి రిసీవర్ మళ్ళీ శివాజీ చెవి దగ్గర వుంచాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in